నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 16 జనవరి 2025 | SANGAREDDY




మీటింగ్‌లో పాల్గొన్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని

## రైతు కూలీలందరికీ అమలు చేయాలి

- గుంట భూమి ఉన్న రైతులను, రైతు కూలీలుగా గుర్తించకపోవడం శోచనీయం
- రాష్ట్రంలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 24.57 లక్షల మంది ఉన్నారు..
- కోతలు లేకుండా రైతు కూలీలందరికీ రూ.12 వేలు ఇవ్వాలి
- నియోజకవర్గాల్లో 3500 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ఎవరు చేస్తారు..?
- గ్రామ సభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలి
- బీఆర్ఎస్ హయాంలో మంజూరై పూర్తికాని ఇండ్లకు నిధులు విడుదల చేయాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా వర్చువల్ సమీక్షలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు లేకుండా అమలు చేయాలని, రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పని చేస్తున్నారు. వీరంతా రోజూ కూలికెళ్లే నిరుపేదలు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలో కోటి 2లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లతో భూభారతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో హరీశ్‌రావు మాట్లాడుతూ... ఒక్క గుంట భూమి ఉన్నా కూలి కాదని, ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలిగా గుర్తింపు అనే నిబంధన కూడా సరైనది కాదన్నారు. అనారోగ్య సమస్యలు, ఇతర సమస్యలతోనూ పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకొని రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలన్నారు. ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద 1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారన్నారు. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తుందని, ఆ 5 గుంటల్లో పంట పండింది లేదు, వారు బతికింది లేదు. 5 గుంటలు ఉన్నందుకు రూ.12 వేలు ఇవ్వం అని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. రైతు భరోసా కింద మీరు ఇస్తున్నది రూ.1500 అయితే ఎగ్గొట్టేది రూ.12 వేలు అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 24.57 లక్షల మంది ఉన్నారు. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే రూ.12,000 నష్టపోతారు. ఇలాంటి రైతులకు రైతు భరో సా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలన్నారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 ఏండ్ల వయస్సు దాటితే కార్డు కోల్పోతారు. ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలి**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వం చెప్పింది. కానీ లబ్ధిదారుల ఎంపిక విధి విధానాలు విడుదల చేయలేదన్నారు. సిద్దిపేట జిల్లాలో 68 వేల దరఖాస్తులు వచ్చాయి. డోర్ టు డోర్ సర్వేలో మిగిలిన ఇండ్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫైనల్ చేస్తారు అని పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేదన్నారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే గ్రామ సభలు పెట్టి ఎంపిక చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై కొంత నిర్మించుకున్న ఇండ్లు పూర్తి చేసుకోడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. అందరూ పేదవారే కాబట్టి వెంటనే నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

సిద్దిపేట, జనవరి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో కొత్త ఇండ్ల నిర్మాణం కోసం పేదలు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారని, అర్హులైన వారందరికి ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చిన్న చిన్న పనుల మూలంగా గృహప్రవేశాలు ఆగిపోయాయని, వాటిని నిధులు మంజూరు చేయాలన్నారు. యాసంగి నాట్లు పూర్తి అవుతున్నాయని, రైతుభరోసా రైతులందరికీ అందేలా చూడాలన్నారు. రైతు కూలీలు, కౌలు రైతులందరికీ ఇందిరమ్మ భరోసా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని కాలువలు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.



పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

## బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం

**పటాన్‌చెరులో కార్పొరేటర్ మెట్టు కుమార్, నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

పటాన్‌చెరు, జనవరి 15: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టు నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలను పటాన్‌చెరు పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. మంగళవారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌ను ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ తర్వాత ఆయనను, బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో వారిని కూర్చోబెట్టి సొంత పూచీకత్తుపై సాయంత్రం వదిలారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అధికార కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పాలనలో లోపాలను దాచిపెట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెడుతున్నదన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కివేయాలనే దురాలోచన చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపట్టారు. సంక్రాంతి పండుగ ఇంట్లో జరుపుకోకుండా పోలీసులు వచ్చి తనను, పార్టీ నాయకులను హౌస్ అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక శక్తి అని, కాంగ్రెస్ నాయకులు ఎంత అణచివేసేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండదన్నారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ మహాశక్తిగా అధికార పార్టీని నిలదీస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు.



జీవవైవిధ్య సంరక్షక మహిళా రైతును సన్మానిస్తున్న ఐసీఏఆర్ డైరెక్టర్ అటారి జోన్-10 షేక్ ఎన్.మీరా, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. ప్రసాద్‌రావు

# చిరుధాన్యాలకు ఆదరణ

- ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు పెరుగుతున్న వ్యాపారం
- చిరు ధాన్యాల సాగును మరింత మెరుగుపర్చేందుకు కృషి ఐసీఏఆర్, డైరెక్టర్ అటారి జోన్-10 డా. షేక్ ఎన్.మీరా
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి గ్రామంలో అట్టహాసంగా పాత పంటల జాతర ప్రారంభం
- నెల రోజులపాటు రోజుకో ఊరిలో చిరుధాన్యాల ప్రదర్శన

**ప్రపంచ దేశాలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను చాటిచెప్పిన ఘనత డీడీఎస్ మహిళలదే..**



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి గ్రామంలో పాత పంటల విత్తనాలతో ఊరేగింపుగా తరలివస్తున్న ఐసీఏఆర్ డైరెక్టర్ అటారీ జోన్-10 షేక్ ఎన్.మీరా, జయంశంకర్ వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డా. విజయ్‌కుమార్, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు

జహీరాబాద్, జనవరి 15: పాత పంటలైన చిరు ధాన్యాలను పరిరక్షించే డీడీఎస్ మహిళా సంఘాల కృషి త్వరలోనే ఫలించనుందని, వాటికి మంచి రోజులు రాబోతున్నాయని రాష్ట్ర ఐసీఏఆర్, డైరెక్టర్ అటారి జోన్-10 డా. షేక్ ఎన్.మీరా పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి గ్రామంలో డీడీఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25వ పాత పంటల జాతరను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ వ్యవసాయ విధానంలో చోటు చేసుకుంటున్న పరిణామాల వల్ల సంక్షోభంలో ఉన్నదన్నారు. పంటల సాగులో విపరీతంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం వల్ల భూసారం పూర్తిగా కలుషితమవున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే పప్పుధాన్యాలు, తినుబండారాలతో అనేక రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కనుమరుగవుతున్న పాత పంటలను పరిరక్షించడంలో డీడీఎస్ మహిళా సంఘాలు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ, విదేశాలతోపాటు ఐక్య రాజ్య సమితిలో పాత పంటలైన చిరుధాన్యాల సాగు ఎంతో అవసరం ఉందని, ప్రతిఒక్కరూ చిరు ధాన్యాల సాగు గురించి ఆలోచించి వాటి చర్చించేలా చేసిన ఘనత పస్తాపూర్ డీడీఎస్ మహిళా సంఘాలకే దక్కిందన్నారు. ప్రస్తుతం చిరు ధాన్యాలకు ప్రపంచ వ్యాప్తంగా 135 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో 300 బిలియన్ డాలర్లకు చేరుకోబోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆఫ్ న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా చిరు ధాన్యాలకు పెద్ద పీటా వేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులోభాగంగా జహీరాబాద్ డీడీఎస్ చిరు ధాన్యాలను ప్రత్యేక బ్రాండ్‌గా గుర్తించి, దాని విశిష్టతను తెలియజేయాల్సి అవసరం ఎంతైన ఉందని, దీనికోసం తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. చిరు ధాన్యాల పరిరక్షించడమే కాకుండా అధునిక పద్ధతులతో సాగును మరింత మెరుగుపర్చేందుకు జహీరాబాద్ డీడీఎస్-కేవీకేకు కేంద్రానికి ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్య నిపుణుడు ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. పూర్వకాలంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటల్లో ఎన్నో పోషకాలు ఉండేవని, దీంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారన్నారు. హరిత విప్లవం ద్వారా పంటలు అధిక దిగుబడులను సాధించేందుకు మితిమీరిన రసాయన ఎరువులను వినియోగించడంతో ప్రజలు, జంతువులు అనేక రోగాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పాతపంటలను పరిరక్షణతోపాటు వాటి సాగును మరింత పెంచేందుకు డీడీఎస్ మహిళా సంఘాల కృషిని అభినందించారు. బసంతపూర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధ కేంద్రం, చెరుకు విభాగం రాష్ట్ర ప్రధాన శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్ వ్యవసాయం సుభీక్షంగా ఉన్నప్పుడే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులను వాడడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. పాత పంటలతో వండే వంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్ర రైతు స్వరాజ్ వేదిక, మహిళా హక్కుల సామాజిక కార్యకర్త ఉషాసీతాలక్ష్మి మాట్లాడుతూ.. రైతులంటే ఎప్పటికీ ముఖ్యంగా మగవాళ్లే రైతులు అనుకునేవారమన్నారు. వ్యవసాయంలో మహిళల పాత్ర ఉందనేది డీడీఎస్ మహిళా సంఘాల కృషితో తెలిసిందన్నారు. ప్రభుత్వ విధానాలు, రైతుల అవసరాల దృష్ట్యా రానున్న రోజుల్లో భూములు తమ చేతిలో లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. పాత పంటల పరిరక్షణతో పాటు భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఆనంతరం జీవవైవిధ్య సంరక్షణకు కృషి చేస్తున్న మహిళా రైతులైన శోభమ్మ, నర్సమ్మ, లచ్చమ్మ, అనిషమ్మ, రత్నమ్మలను ఘనంగా సన్మానం చేసి బహుమతులు అందజేశారు. అనంతరం హార్వెస్ట్, హెవెన్-సీడ్స్ ఆఫ్ డైవర్సిటీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపును ఐసీఏఆర్ డైరెక్టర్ అటారి జోన్-10 డా. షేక్ ఎన్.మీరా ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఎడ్ల బండ్ల ఊరేగింపు, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, రైతుల జానపద నృత్యాలు, ఆటపాటలతో సందడిగా మారింది. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రసాద్‌రావు, సీనియర్ జర్నలిస్టు పతంగి రాంబాబు, హైకోర్డు అడ్వకేట్ రవికుమార్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, రైతు నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగురి, జాయింట్ డైరెక్టర్ గిరిధార్‌బాబు, లైజన్ ఆఫీసర్ మాణిక్యం, జాతర కోఆర్డినేటర్లు విజయ్‌కుమార్, మంజుల, మహిళా సభ్యులు నర్సమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.



పాత పంటల విత్తనాలతో అందంగా అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న షేక్ ఎన్.మీరా




పాత పంటల జాతరలో మాట్లాడుతున్న ఐసీఏఆర్ డైరెక్టర్ అటారీ జోన్-10 షేక్ ఎన్.మీరా

## కేటీఆర్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసిందన్న మాట అబద్ధం

- కాంగ్రెస్ నాయకుల మాటలు అవగాహన రహిత్యం
- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ, జనవరి 15: సుప్రీం కోర్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అప్పీల్‌ను కొట్టి వేసిందని కాంగ్రెస్ నాయకులు చెప్పడం శుద్ధ అబద్ధమని, కాంగ్రెస్ నాయకుల మాటలు అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి బుధవారం మండిపడ్డారు. సుప్రీం కోర్టు ఈ దశలో జోక్యం చేసుకోవడం సముచితం కాదని అన్నదని...సుప్రీం కోర్టు సూచన, ఆలోచన మేరకు న్యాయ వ్యవస్థపైన సంపూర్ణ గౌరవంతో కేటీఆర్ న్యాయవాదులు సుమోటోగా అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలు చేసే నాటికి మొత్తం వ్యవహారం ఎఫ్ఐఆర్‌గా మాత్రమే ఉంది.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఈనెల 7న కేటీఆర్ న్యాయవాదులు సుప్రీం కోర్టుకు వెళ్లారని చెప్పారు. సమయాభావం వలన వాయిదా వేసిందన్నారు. కేటీఆర్ మాత్రం ఈనెల 9వ తేదీన ఏసీబీ కార్యాలయానికి వెళ్లి విచారణకు పూర్తిగా సహకరించారని సుభాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ కేసు కేవలం రాజకీయ వేధింపులు మాత్రమే అనే విషయాన్ని స్పష్టంగా ఏసీబీ అధికారులకు కేటీఆర్ తెలియజేశారన్నారు. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్నా విజ్ఞప్తిపై 9వ తేదీన సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారని, బుధవారం సుప్రీం కోర్టు సలహా మేరకు వెనక్కి తీసుకున్నారని సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం అప్పీల్‌ను కేటీఆర్ వెనక్కి తీసుకోవడం ఎదురు దెబ్బ అని అవగాహన రాహిత్యంగా మాట్లాడటం సరికాదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సుప్రీం కోర్టులో తమ అప్పీళ్లను వెనక్కి తీసుకోలేదా అని సుభాష్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు చరిత్రను గుర్తుంచుకోవాలని సూచించారు.



దుబ్బాకలో మల్లన్నసాగర్ 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ (ఉప కాల్వల)నిర్మాణం చేపట్టాలని ధర్నా చేస్తున్న రైతులు

## ఉపకాల్వ నిర్మాణ పనులు చేపట్టాలని ధర్నా

దుబ్బాక, జనవరి 15: మల్లన్న సాగర్ ఉప కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేసి, సాగునీటి సమస్య పరిష్కరించాలని పలు గ్రామాల రైతులు ధర్నాకు దిగారు. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్న సాగర్ 4 ఎల్ డిస్ట్రిబ్యూషన్ కాల్వ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో సంబంధిత గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం దుబ్బాక మండలంలోని కమ్మర్‌పల్లి, అచ్చుమాయిపల్లి, పోతారం తదితర గ్రామాల రైతులు దుబ్బాక -చెల్లాపూర్ రోడ్డులో బైటాయించి నిరసనకు దిగారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఉప కాల్వల నిర్మాణ పనులు కొనసాగడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి, సంబంధిత అధికారులు స్పందించి కాల్వల నిర్మాణం చేపట్టి యాసంగిలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉప కాల్వల నిర్మాణం పనులు పూర్తయితే పంటలకు ఇబ్బంది ఉండదన్నారు. లేకపోలే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికీ అందాలి

**ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ**

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నూతన పథకాలపై బుధవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాహుల్‌రాజ్, క్రాంతి, మనుచౌదరిలతో ఢిల్లీ నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ ఆఫీసర్ హరిచందనతోపాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజ్యాంగం అమలులోకి వచ్చి 2025, జనవరి 26 నాటికి 75 ఏండ్లు అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, నూతన రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈ పథకాలకు సంబధించిన విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై మంత్రి కలెక్టర్లతో చర్చించారు. రాజకీయ ప్రమేయం లేకుండా పథకాలు ప్రయోజనాలు పేదలకు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూభారతి పోర్టల్‌లో నమోదైన పట్టాదారులు మాత్రమే రైతుభరోసా పథకం కింద అందించే ఆర్థిక సహాయానికి అర్హులన్నారు. రియల్ భూములు, నాలా కన్వర్షన్ భూములు, లేఅవుట్ భూములు, మైనింగ్ భూములు, గోదాంలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములకు ఈ పథకం వర్తించదన్నారు. ఈ పథకం అమలుకు నోడల్ ఆఫీసర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటే భవిష్యత్తు అవసరాలకు బాగుంటుందని, ఆ దిశగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవాని మంత్రి కలెక్టర్లకు తెలిపారు. ఈ పథకం కింద భూమి లేని పేద వ్యవసాయ కూలి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందివ్వనున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఉపాధిహామీ కింది కనీసం 20 రోజులు పని చేసిన వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తామన్నారు. గ్రామసభలు నిర్వహించి మార్గదర్శకాల అనుగుణంగా లబ్ధిదారులను గుర్తించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో విధివిధానాలను మంత్రి కలెక్టర్లతో చర్చించారు. సీఎం ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా గుర్తించిన వారిలో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనవరి 26 నాటికి లబ్ధిదారులు జాబితాను వెల్లడించే విధంగా సన్నద్ధంగా ఉండాలన్నారు. ఒక వ్యక్తికి ఒకేచోట రేషన్‌కార్డు ఉండేలా వన్ రేషన్, వన్ స్టేట్‌గా రేషన్ కార్డుల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అర్హత గల ప్రతి కుటుంబానికీ రేషన్‌కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కొత్తగా అమలు చేయనున్న పథకాలకు సంబంధించి ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. లబ్ధిదారుల ఎంపికకు గ్రామాల వారీగా టీమ్‌లు ఏర్పాటుతోపాటు గ్రామ సభల నిర్వహణకు షెడ్యూలు తయారు చేసుకున్నట్లు మెదక్ కలెక్టర్ రాహూల్ రాజ్ మంత్రికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి సురేష్ రెడ్డి, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఈడీఎం సందీప్ పాల్గొన్నారు.



హాజరైన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, అధికారులు



మెదక్ జిల్లా ఘనపూర్ ప్రాజెక్టు

## ఘనపూర్‌కు నీటి విడుదల

పాపన్నపేట, జనవరి 15: యాసంగి పంటకు సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టుకు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. మెదక్ జిల్లా ఘనపురం ఆయకట్టు పరిధిలోని 21.625 ఎకరాల సాగుకు సుమారు 3 టీఎంసీల నీరు అవసరం అవుతుందని చెప్పారు. ఇందులో మొదటి విడతగా 0.35 టీఎంసీల నీటిని కలబ్‌గూర జెన్‌కో ప్రాజెక్టు నుంచి విడుదల చేశారు. గురువారం సాయంత్రం వరకు ఘనపురం ప్రాజెక్టుకు నీరు చేరుతుందని, పశువులకాపరులు, మత్స్యకారులు మంజీరా నదిలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.